# కత్తెర

టీ తాగడం ముగించి సిగరెట్ వెలిగించాడు దామోదరం. చల్లటిగాలి చీకట్లో మందంగా తచ్చాడుతోంది. వర్షం వచ్చేట్టుంది.వర్షం రాకుండా ఉంటే బావుండు అనుకున్నాడు.

చేతి గడియారం వంక చూసుకున్నాడు. తొమ్మిదీ పదయింది. టీ కొట్లో తను కాకుండా మరో ఇద్దరున్నారు. కొట్టు పెద్దదేమీ కాదు. కొట్టు మూసివేసే సమయం ఎప్పుడో అనుకుంటూ గుండె నిండా పొగ పీల్చి కొట్టువాడి వంక చూశాడు. వాడు తన వంకే చూస్తున్నాడు. తన ప్రవర్తన అతనికి వింతగా అనిపిస్తోందా? గుండెలోకి తొంగి చూస్తున్నట్టు అనిపిస్తోంది. వాడి చూపులు ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఈ టీకొట్టు తను ఆఫీసుకు వెళ్ళేదారిలో ఉన్నా అక్కడికి వచ్చి టీ తాగడం అదే మొదటిసారి. టీ రుచి తెలియటం లేదు. ఇంటికి త్వరగా వెళ్ళామనిపించడం లేదు. అప్పటికి గంటన్నర నుండి అక్కడే ఉన్నాడు. ఇప్పుడు తను తాగింది పదో టీ. టీలు అన్ని సార్లు ఎప్పుడూ తాగలేదు. ఆలోచనలు చిక్కుపడినట్టున్నాయి.

టీ డబ్బులిచ్చి బయటకు వచ్చాడు. సగం కాలిన సిగరెట్ మురికి కాలువలో పడేలా విసిరాడు. నోరు చేదుగా ఉంది. ఒక గంటలో పేకెట్ సిగరెట్లు కాల్చి ఉంటాడు. ఇహ నుండి సిగరెట్లు తాగకూడదు అనుకున్నాడు.అలా మానుకోవడం అనుకోవడంగానే మిగిలిపోయింది. మానుకుందామని గట్టిగా అనుకున్నప్పుడల్లా ఏదో సమస్య ఎదురవుతోంది. కాలరు మెడ చుట్టూ లాక్కుని స్టేషన్ వైపు నడవడం మొదలు పెట్టాడు. రైలు స్టేషన్ అక్కడకు అట్టే దూరంలో లేదు.

ప్లాట్‌ఫాంలో అక్కడో లైటు, ఇక్కడో లైటు వెలుగుతున్నాయి. ప్లాట్‌ఫాం చివరి వరకు నడిచి సిమెంటు బెంచి మీద కూర్చున్నాడు. అక్కడి లైటు ఉండుండి వెలుగుతోంది. ప్లాట్‌ఫాం మీద నలుగురయిదుగురు తప్ప ఎక్కువమంది జనం లేరు. చొక్కా జేబులోంచి మడతపెట్టి ఉన్న కాయితం బయటకు తీశాడు. అప్పటికి ఆ ఉత్తరం చాలాసార్లు చదివాడు. అది తన భార్యకు అతనే రాసిన మొట్టమొదటి ఉత్తరం. పెళ్ళయి ఎనిమిది సంవత్సరాలు దాటినా తను వసంతకు ఎప్పుడూ ఉత్తరం రాయలేదు. ప్రేమ లేక కాదు. ప్రేమగా ఎప్పుడూ మాట్లాడలేదు. మాట్లాడాలని అనిపించేది. మాట్లాడలేకపోయేవాడు. ఇన్ని మల్లెపూలు కొని తీసుకొచ్చి ఎప్పుడూ ఇవ్వలేదు. ఆమె ఇష్టాయిష్టాలేమిటో తెలుసుకోవటానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. ఇంటికి కావలసినవన్నీ తీసుకొచ్చి ఇచ్చేవాడు. ఆమె అడగకపోయినా వాడుకోవడానికి డబ్బులిచ్చేవాడు. ఎప్పుడో గాని అవి వాడుకునేది కాదు. దుబారా చేసేది కాదు. చుట్టుపక్కల పిల్లలకు ఫ్రాకులు ఇంట్లో ఉన్న కుట్టుమిషను మీద కుట్టి పెడుతుండేది.

ఉత్తరం వంక చివరిసారిగా చూశాడు. ఆమె యెడల చేసిన తప్పులన్నీ ఒక్కొక్కటిగా రాశాడు. ఉత్తరం ముగిస్తూ తను క్షమించమని కోరాడు. ఆ మాట అండర్‌లైన్ కూడా చేశాడు. ఆ ఉత్తరాన్ని వసంతకు ఇవ్వలేకపోయాడు. అగ్గిపుల్ల వెలిగించి కుడిచేత్తో ఉత్తరాన్ని పట్టుకుని నిప్పు అంటించాడు. కాలడం మొదలెట్టింది. కాలిపోయిన భాగం గాలికి ఎగిరిపోతోంది. చేత్తో పట్టుకున్న చోటు వరకు మంట వచ్చి ఆగిపోయింది. మిగిలిన కాయితం మీద ప్రియమైన వసంతకు' అని ఉంది. వదిలేశాడు. కాయితం ముక్క గాలిలో ఎగురుతూ చాలా దూరం వెళ్ళిపోయింది.

బెంచీ మీద అరగంట పైగా కూర్చున్నాడు. ఇంటికి వెళ్ళాలనీ ఉంది, వద్దనీ ఉంది. వసంతతో తను అనవసరంగా గొడవ పడ్డాడు. అప్పుడప్పుడు వసంతతో మాటా మాటా రావడం కొత్త కాదు. చేయి చేసుకునేవాడు కాదు. చిన్న విషయానికి తనంతగా ఎందుకు రెచ్చిపోయాడో అర్థం కాకుండా ఉంది.

లేచి స్టేషన్ బయటకు వచ్చి ఇంటికి రిక్షా మాట్లాడుకుని ఎక్కి కూర్చున్నాడు. సమయం పదకొండు కావస్తోంది. అరగంటలో విజయవాడ వెళ్ళే బండి ఉంది. అది ఎక్కి వెళ్ళిపోతేనో అనుకున్నాడు. విజయవాడలో తెలిసినవాళ్ళు ఎవరూ లేరు.

హోటల్లో ఉండేంత డబ్బులు చేతిలో లేవు. ఇంట్లో ఉన్నాయి. ఇంటికి వెళ్ళి డబ్బులు తీసుకుని తిరిగొచ్చే సమయానికి బండి వెళ్ళిపోతుంది.

ఇంటికి కొద్దిదూరంలో రిక్షా ఆపమని, ఆగాక దిగి డబ్బులిచ్చాడు. వర్షం జల్లుగా మొదలయింది. రిక్షా వెనక్కి తిరిగి కనుమరుగయ్యేవరకు రోడ్డు వారనున్న చెట్టు కింద నిలబడి తన ఇంటివైపు చూశాడు. పడకగదిలో లైటు వెలుగుతోంది. వీధి నిర్మానుష్యంగా ఉంది. జేబులోంచి రుమాలు తీసి తల మీద వేసుకుని రోడ్డుమీది కొచ్చాడు. ఇంకో రెండడుగులు వడిగా వేసుంటే రోడ్డు దాటి ఉండేవాడే. మసక వెలుగు హెడ్ లైట్లతో వేగంగా వస్తున్న లారీని అతను గమనించలేదు. మనసు ఎక్కడో ఉండటాన లారీ వస్తున్న శబ్దం కూడా వినలేదు. పిడుగుపాటులా తగిలిన బంపర్ దెబ్బకు ఎగిరి విసిరేసినట్టు రోడ్డుకు అవతల ఉన్న రాళ్ళ మీద పడ్డాడు. లారీ ఆగలేదు.

అతను తెప్పరిల్లటానికి పది నిముషాలు పట్టింది. తలకు రాయి తగలటం వలన పెద్ద దెబ్బే తగిలింది. రక్తం కారుతోంది. లేచి కూర్చోవటానికి ప్రయత్నించాడు. వెంటనే వీలు కాలేదు. కొద్దిసేపాగి ఎక్కడలేని శక్తి కూడగట్టుకుని లేచి కూర్చున్నాడు. ముక్కులోంచి రక్తం కారడం మొదలెట్టింది. పక్కనే పడి ఉన్న రుమాలు అందుకున్నాడు. వర్షానికి రుమాలు తడిచిపోయి ఉంది. నీళ్లు పిండి కారుతున్న రక్తం తుడుచుకున్నాడు. పెద్దాయన ఆసరాగా చేసుకుని నెమ్మదిగా లేచి నిలబడ్డాడు. నడుం విపరీతంగా నొప్పి పుడుతోంది. నిమిషం కూడా నిలబడలేకపోయాడు. తూలి ముందుకు పడ్డాడు. మరి లేవలేదు.

❀❀❀

అతని ఇంటి పడక గదిలో గోడ పక్కనే ఉన్న బల్ల మీద ఒక కాయితం ఉంది. అది గాలికి ఎగిరిపోకుండా దాని మీద కత్తెర పెట్టి ఉంది. చుట్టుపక్కల వసంతకు మంచి పేరే ఉంది. వీధి చివర్లో ఉన్న లేడీస్ టైలర్ దగ్గిర నుండి ముక్కలు తెచ్చుకుని వాటితో రంగురంగుల ఫ్రాకులు కుట్టి అనాథ పిల్లలకు ఇస్తుంది.

ఆ ఉత్తరంలో "ఈ సాయంత్రం చిన్నవిషయం చిలికి చిలికి గాలివాన అవుతుందని నేను ఊహించలేదు. తప్పు నాదే. ఉదయం నుండి నా మనసు ఏం బాగోలేదు. జీవితంలో నేను అన్యాయమైన వ్యక్తిని. నా గురించి ఎప్పుటికప్పుడు

మీతో చెబుతామనుకునేదాన్ని. చెప్పడానికి ధైర్యం చాలక చెప్పలేకపోయేదాన్ని. నా మీద అత్యాచారం జరుగుతున్నప్పుడు నా చేతిలో ఒక బ్లేడో, కత్తో, కత్తెరో ఉండుంటే నా జీవితం మరో విధంగా ఉండేదేమో. ఇందాక మీరు నన్ను బెల్టుతో గొడ్డును బాదినట్లు బాదుతూ, తిడ్తూ గొడ్రాలివి అన్నారు. నేను కాదు. మీతో పెళ్ళి కాక ముందు నాకు ఒక పాప పుట్టింది. ఇవేళ ఆ పాప పుట్టినరోజు. ఆ పాప ఏ అనాధ శరణాలయంలో ఉందో నాకు తెలియదు. నేను నిజం దాచి మోసం చేశానన్న ఆలోచనతో ఎంత ప్రయత్నించినా మీకు దగ్గర కాలేకపోయాను. నేను వెళ్ళిపోతున్నాను. ఆత్మహత్యకు పాల్పడను. దయచేసి నాకోసం వెతకొద్దు. మీకు ఎప్పుడూ కనిపించను. మీరు నా మనసులోంచి తొలగిపోరు. ప్రేమతో మీవసంత" అని ఉంది.

ఉత్తరం మీద తేది ఉంది. సమయం ఉంది. ఉత్తరం తొందర్లో రాసినట్టు కాకుండా. నింపాదిగా రాసినట్టు ఉంది. కత్తెర చివరలో మిగిలిపోయిన రక్తపు బొట్టు ఎండి గడ్డ కట్టింది. ఆ దస్తూరి వసంతది కాదు. దామోదరానిది.

❖ రచన, మాసపత్రిక, మే, 2008